సాక్షి
ఒడిశా
గురువారం । 7 । నవంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 6,93,260
బంగారం : 250 మిల్లీ గ్రాములు
వెండి : 45 గ్రాముల 720 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



దాడులు చేసే దమ్ముందా?

ప్రభుత్వానికి, అధికారులకు కార్పొరేట్ వ్యాపార సంస్థలపై దాడులు జరిపే దమ్ముందా అని ఒడిశా రాష్ట్ర వ్యాపార మహా సంఘం కార్యదర్శి సుధాకర్ పండా ప్రశ్నించారు. - 10లో




అదనపు తరగతి గదులు ప్రారంభం

కాశీనగర్ శ్రీరాం డిగ్రీ కళాశాలలో రూ.50 లక్షల ప్రభుత్వ నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను బుధవారం ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ప్రారంభించారు. - 10లో

రేషన్ బియ్యం.. పురుగుల మయం







రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితి హడిగుడ పంచాయతీకి సరఫరా చేసిన రేషన్ బియ్యంలో పురుగులు గుట్టలుగా పేరుకుపోయాయి. అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలకు సంబంధించి 200 క్వింటాళ్ల బియ్యం పంచాయతీ కార్యాలయానికి వచ్చాయి. బస్తాలు ఇప్పిన వెంటనే పురుగులు గుట్టలుగా కనిపించడంతో లబ్ధిదారులు వాటిని తీసుకునేందుకు నిరాకరించారు.ఉచితంగా రేషన్ బియ్యానికి బదులు ఉచితంగా రోగాలను అంటగట్టేలా ఉందంటూ ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. మంచి బియ్యంఇవ్వకపోతే పంచాయతీ కార్యాలయానికి తాళం వేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. అనంతరం సిబ్బంది స్పందిస్తూ 400 బియ్యం ప్యాకెట్లు పూర్తిగా నాసిరకంగా ఉన్నాయని, ఎక్కువగా పురుగులే కనిపిస్తున్నాయన్న సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వేరే బియ్యాన్ని పంపిస్తే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

– రాయగడ


బియ్యం తీసుకెళ్లేందుకు నిరాకరిస్తున్న లబ్ధిదారులు

న్యూస్‌రీల్

గవర్నర్‌తో ఓపీఎస్‌సీ అధ్యక్షుడి భేటీ


గవర్నర్‌తో అరుణ్ షడంగి

భువనేశ్వర్: ఒడిశా పబ్లిక్ సర్వీసు కమిషను ఓపీఎస్‌సీ అధ్యక్షునిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అరుణ్ షడంగి బుధవారం రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్‌తో రాజ్‌భవన్‌లో సమావేశమయ్యారు. సౌజన్యాత్మక భేటీగా ఆయన పేర్కొన్నారు.

విజిలెన్స్ వారోత్సవాల ముగింపు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సబ్ కలెక్టర్

రాయగడ: స్థానిక అటానమస్ కళాశాలలో వారం రోజులుగా జరుగుతున్న విజిలెన్స్ వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. ముగింపు సభకు హాజరైన సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్రా దేవి మాట్లాడుతూ సైబర్ నేరాలకు గురి కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బబిలత షరప్, అధ్యాపకులు శ్రీనివాస్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనే ధ్యేయం


మాట్లాడుతున్న కలెక్టర్ పట్వారి

రాయగడ: బాల్యవివాహాల నిర్మూలనే ధ్యేయంగా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఫరూల్ పట్వారి ఆదేశించారు. మంగళవారం స్థానిక డీఆర్‌డీఏ సమావేశం మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలనకు ఏర్పాటైన అద్వికా పథకం సక్రమంగా అమలయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి శనివారం 10 నుంచి 19 ఏళ్ల లోపు బాల,బాలికలతో సమావేశమై చైతన్యపరచాలని సూచించారు. సమావేశంలో జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రౌత్రాయ్, జిల్లా అదనపు విద్యాశాఖ అధికారి భజన్ లాల్ మాఝి తదితరులు పాల్గొన్నారు.

టీవీ స్టూడియోలో అగ్నిప్రమాదం


ఎగిసిపడుతున్న మంటలు

భువనేశ్వర్: ప్రైవేట్ టెలివిజన్ చానెల్ (స్టూడియో)లో బుధవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఖుర్దా టౌన్ సరువా ప్రాంతంలో పని చేస్తున్న ఈ స్టూడియోలో తెల్లవారు జామున భారీ స్థాయిలో మంటలు రేగాయి. ఈ పరిస్థితికి కారణాలు తెలియాల్సి ఉంది. అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరి మంటలను ఆర్పివేసింది. స్టూడియో తొలి అంతస్తు దెబ్బతిన్నట్లు ప్రాథమిక సమాచారం. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని స్టూడియో వర్గాలు తెలిపాయి.

తేనెటీగలో దాడిలో ఒకరి మృతి


వేణుగోపాల్ (ఫైల్)

రాయగడ: తేనెటీగల దాడిలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడిన ఘటన కళ్యాణసింగుపూర్‌లో చోటుచేసుకుంది. మంగళవారం నాగులచవితి సందర్భంగా నాగనాళి నదీ సమీపంలోని శివమందిరం పక్కన పుట్టలో పాలు వేసేందుకు బి.వేణుగోపాల్ (64) కుటుంబ సమేతంగా వెళ్లాడు. పూజా కార్యక్రమాలు ముగించుకుని తిరిగివస్తుండగా అక్కడే చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనలో వేణుగోపాల్ మృతి చెందగా కొడుకు, కోడలు గాయపడ్డారు. బాధితులను కళ్యాణసింగుపూర్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

కట్టుకున్నోడే కాలయముడు

- వీడిన నందపూర్ మహిళ హత్య కేసు
- చెట్టుకు కట్టేసి భార్యను చంపించిన భర్త


పట్టుబడిన నిందితులతో నందపూర్ పోలీసులు

కొరాపుట్: జిల్లాలోని నందపూర్ హత్య కేసు మిస్టరీ వీడింది. భార్యను భర్తే హత్య చేయించాడని పోలీసుల విచారణలో తేలిసింది. బుధవారం నందపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌డీపీఓ మనోబ్రత శత్పతి కేసు వివరాలు వెల్లడించారు. సోమవారం కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి కుమర్ గందన గ్రామ పంచాయతీ హరియా ముండ గ్రామంలో మహేంద్ర ఖొర, అతని సతీమణి సావి ఖొర (24)లపై దుండగులు దాడి చేసి.. భర్తను చెట్టుకు కట్టేసి భార్యను హత్య చేసిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా భర్త మహేంద్ర ఫోన్‌ను తనిఖీ చేశారు. తనను దొంగలు కట్టి వేశారని చెప్పిన సమయంలోనే అతని ఫోన్ నుంచి రెండు నంబర్లకు కాల్స్ వెళ్లాయి. దాంతో పోలీసులకు అనుమానం వచ్చి ఆ నంబర్ల ఆధారంగా సోమనాథ్ బోయి, మహేష్ మాలీ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఆ నేరం తామే చేశామని అంగీకరించారు. మృతురాలి భర్త మహేంద్రకు వీరిద్దరు స్నేహితులు. దాంతో పోలీసులు మహేంద్రను అదుపు లోకి తీసుకొని ప్రశ్నించగా నిజం ఒప్పుకున్నాడు. తన భార్యతో విభేదాలు కారణంగా స్నేహితులతో కలిసి హత్యకు ప్రణాళిక వేసినట్లు అంగీకరించాడు.

వ్యక్తి దారుణ హత్య

- భార్య హస్తం ఉందంటూ మృతుడి అన్న ఫిర్యాదు


జుధిష్టర్ మృతదేహం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి కుకుడి పాదొరొ గ్రామ శివారులో ఓ యువకుడి మృతదేహాన్ని అంద్రాకంచ్ పోలీసులు మంగళవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. మృతుడు సమితిలోని నువాగా గ్రామంలో జిరిగావీధికి చెందిన సుధిష్టిర్ జాని (43) గా గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అయితే తన తమ్ముడిని దారుణంగా హత్య చేశారని, దీని వెనుక తమ్ముడి భార్య సుకుమతి జాని హస్తముందని మృతుడి సోదరుడు అంద్రాకంచ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. కొద్ది సంవత్సరాల క్రితం నువాగా గ్రామానికి చెందిన జుధిష్టర్ కుకుడి పాదొరొ గ్రామానికి చెందిన సుకుమతిని వివాహం చేసుకున్నాడు. కొద్ది నెలలుగా వీరి మధ్య తగాదాలు జరుగుతున్నాయి. ప్రతి రోజూ భర్త తాగివచ్చి తనను కొడుతుండేవాడని సుకుమతి ఆరోపిస్తుండేది. ఈ క్రమంలో ఆదివారం వారిద్దరి మధ్య గొడవ జరగడంతో సోమవారం పుట్టింటికి వెళ్లిపోయింది. భార్యను ఒప్పించి ఇంటికి తీసుకెళ్లేందుకు వెళ్లిన జుధిష్టర్ మంగళవారం గ్రామశివారులో శవమై కనిపించాడు. తీవ్రగాయాలతో ఉన్న మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు

- ఇద్దరు దుర్మరణం
- డ్రైవర్ పరిస్థితి విషమం


ప్రమాదంలో నుజ్జయిన కారు

భువనేశ్వర్: కారు అదుపు తప్పి చెట్టుని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందగా.. డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. పూరీ జిల్లా కోణార్కు సమీపం జుణై బజారు ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. విషమ పరిస్థితిలో కారు డ్రైవర్ మృత్యువుతో పోరాడుతున్నారు. మృతులను భువనేశ్వర్‌కు చెందిన ప్రదీప్త బెహెరా, కటక్ జిల్లా కొంటపాడా గ్రామస్తుడు బిశ్వజిత్ సాహు మృతులుగా గుర్తించారు. వీరివురు ఘటనా స్థలంలో కన్ను మూశారు. దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కారు డ్రైవరు పూరీ జిల్లా నియాలి మండలం నువాపట్న గ్రామస్తుడుతాపస్ సాహుగా గుర్తించారు. మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో భువనేశ్వర్ నుంచి కోణార్కు వస్తుండగా జుణై బజారు ప్రాంతంలో అదుపు తప్పిన కారు ఎదురుగా ఉన్న మామిడి చెట్టుని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. కారు పూర్తిగా నుజ్జు అయింది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గ్యాసు కట్టరుతో కారు భాగాలు కోసి లోపల ఇరుక్కుపోయిన డ్రైవర్, మృతులను బయటకు తీశారు. డ్రైవరు ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్నట్లు గుర్తించి తక్షణ చికిత్స కోసం గోప్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం స్థానిక క్యాపిటల్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కోణార్కు ఠాణా పోలీసులు ఘటనా స్థలం సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ట్రైనింగ్ స్కూల్ రోడ్డులో దొంగతనం

- బంగారు ఆభరణాలు అపహరణ

పర్లాకిమిడి: స్థానిక డైట్ ట్రైనింగ్ స్కూల్ రోడ్డులో తాళం వేసి ఉన్న ఇంటిని దొంగలు పగలగొట్టి ఆరు తులాల బంగారం, వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లినట్లు ఆదర్శ పోలీసు స్టేషన్ ఐఐఈ ప్రశాంత్ భూపతి బుధవారం తెలిపారు. ఇంటి యజమాని విఘ్నరాజ్ పట్టజోషి ఈనెల రెండో తేదీన గుణుపురం వెళ్లి తన బావమరిది కొడుకుకు ఇంటి తాళాలు ఇచ్చాడు. అయితే బుధవారం ఉదయం పది గంటలకు ఇంటి తలుపులు తెరిచి చూడగా.. లోపల పెట్టె, దుస్తులు చిందర వందరగా పడి ఉండటాన్ని పట్టజోషి బంధువులు గమనించి ఆయనకు ఫోన్ ద్వారా తెలియజేశారు. గుణుపురం నుంచి పర్లాకిమిడి తిరిగివచ్చిన విఘ్నరాజ్ పట్టజోషి ఇంటిలో దొంగతనం జరిగిందని గమనించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై పర్లాకిమిడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థుల అరెస్టు

భువనేశ్వర్: జూనియర్ విద్యార్థి పట్ల ర్యాగింగ్‌కు పాల్పడిన ఐదుగురు సీనియర్ విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని ఏడాది పాటు తరగతుల నుంచి బహిష్కరించారు. ఈ ఘటన కెంజొహర్ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో చోటు చేసుకుంది. మంగళవారం అర్ధరాత్రి సీనియర్లు జూనియర్ విద్యార్థిని ఉంటున్న హాస్టల్ గదికి వెళ్లారు. తలుపులు తీయకపోవడంతో విరగ్గొట్టి బలవంతంగా చొరబడ్డారు. తలుపులు తెరవలేదన్న ఉక్రోషంతో జూనియర్‌ను ఇనప ఊచలు, కర్రలతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం బాధితుడిని చికిత్స కోసం స్థానిక జిల్లా ఆస్పత్రిలో చేర్చారు. విషయం తెలుసుకున్న బాధిత విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు దాఖలు చేశారు. విచారణ చేపట్టిన కళాశాల యాజమాన్యం విద్యార్థులను తరగతుల నుంచి బహిష్కరించింది.

ఎరక్కపోయి వెళ్లి.. ఇరుక్కుపోయింది..


డబ్బాలో చిక్కుకున్న పాము

జయపురం: స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బుధవారం ఓ భారీ పాము టిన్ను డబ్బాలో దూరి చిక్కుకుపోయింది. డబ్బాలోనికి చొరబడిన పాము బయటకు వచ్చేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. పాము పడుతున్న అవస్థను విద్యార్థులు, ప్రజలు దూరం నుంచి చూస్తూ ఉండిపోయారు. చివరకు కొంతమంది యువకులు ధైర్యం చేసి కర్రతో డబ్బాను పైకి ఎత్తగా ఎట్టకేలకు ప్రాణాలతో బయటపడిన పాము సమీపంలో ఉన్న పార్క్‌లోకి జారుకుంది.

• గుడ్‌మార్నింగ్ సీఎం సార్!



తెలతెలవారుతుండగా బుధవారం శుభోదయ వేళ ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి స్థానిక కళింగ స్టేడియంలో ప్రత్యక్షమయ్యారు. ఆయనతో పాటు రాష్ట్ర క్రీడా విభాగం మంత్రి సూర్యవంశీ సూరజ్, ఎమ్మెల్యే ఆకాష్ దాస్ నాయక్‌లు కలిసి మార్నింగ్ వాక్ చేశారు.

– భువనేశ్వర్

కాళీమాత పెండాల్ సందర్శన


విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: స్థానిక నెహ్రూ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన శ్యామకాళీ పెండాల్‌ను పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి బుధవారం సాయంత్రం సందర్శించారు. కార్తీక మాసంలో స్థానిక ప్రజలందరికీ మంచి జరగాలని కాళీమాతను కోరానని ఎమ్మెల్యే విలేకరులతో అన్నారు. ఈ సందర్భంగా పెండాలక్ కొంత మొత్తాన్ని విరాళంగా అందజేశారు. ఆయన వెంట పురపాలక సంఘం అధ్యక్షురాలు నిర్మలా శెఠి, బీజేడీ పార్టీ కార్యదర్శి ప్రదీప్ నాయక్, భరత్ భూషన్ మహంతి ఉన్నారు.

ఘనంగా విశ్వశాంతి హోమం


హోమం చేస్తున్న ఆదివాసీలు

రాయగడ: ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీచైతన్య రాంజీ ఆధ్వర్యంలో సదరు సమితి హాలువ పంచాయతీ జమ్మిలిమ్మ గ్రామంలోబుధవారం విశ్వశాంతి కోసం పంచ మహాయజ్ఞ అనుష్ఠానం హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు వచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. అధిక సంఖ్యలో ఆదివాసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయాలపాలైన వెంకటరమణ

సారవకోట: మండలంలోని అలుదు గ్రామానికి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాకివలస గ్రామానికి చెందిన ఎస్.వెంకటరావు గాయాలపాలైయ్యాడు. వెంకటరావు సారవకోట నుంచి అలుదు గ్రామం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఆయనను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మృతుడి కుటుంబానికి రూ.12,76,052 అందజేత



సుందరమ్మకు పరిహారం అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: అరిణాం అక్కివలసలోని నాగార్జునా అగ్రికెం పరిశ్రమలో పనిచేస్తున్న సుతారి రాజేష్ అనే కార్మికుడు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కార్మికులు ఒక్క రోజు వేతనం ప్రకటించగా, పరిశ్రమ యాజమాన్యం పలు రాయితీలు వర్తింపజేశారు. ఈ మొత్తం రూ.12,76,052 బుధవారం పరిశ్రమ ఉపాధ్యక్షుడు కె.శేషగిరిరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఆధ్వర్యంలో రాజేష్ భార్య సుందరమ్మకు అందజేశారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న అంజనాస్ ఫౌండేషన్ చైర్మన్ నవీన్ బచ్చు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 107 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. కళాశాల జేకేసీ, అంజనాస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్కిన్డర్ ఎలక్ట్రికల్ కాంపొనెంట్స్, ప్రీమియర్ ఎనర్జీ సోలార్ ప్యానల్, టాటా ఎలక్ట్రానిక్స్, ఐఫోన్ అసెంబ్లింగ్ తదితర కంపెనీల్లో ఖాళీలకు 154 మంది హాజరయ్యారని చెప్పారు. ప్రతిభ కనబరిచిన 107 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని వివరించారు. కార్యక్రమంలో అంజనాస్ ఫౌండేషన్ చైర్మన్ నవీన్ బచ్చు, బి.సతీష్‌కుమార్, వి.ల్యూక్‌పాల్, బి.ఝాన్సీరాణి పాల్గొన్నారు.

పింఛన్లు ఇవ్వలేదంటూ ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

బూర్జ: మండలంలోని తోటవాడలో పింఛన్లు అందక లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకు పింఛన్ అందచేసి ప్రస్తుతం పింఛన్ నిలుపుదల చేశారని గ్రామానికి చెందిన శేపాన గోవిందరావు, శేపాన భుజంగరావు, గేదెల శ్రీనివాసరావు, గుమ్మడి చిన్నమ్మడు బుధవారం సచివాలయం వద్ద లబోదిబోమన్నారు. ఈ విషయమై బూర్జ ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థి కృపాసింధును అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

మెళియాపుట్టి: శ్రీకాకుళం నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో ఈనెల 3, 4 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో పెద్దమడి గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎం.కృపాసింధు సత్తాచాటాడు. ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానం, లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. దీంతో లక్నోలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పెద్దమడి కళాశాలలో పతకాలు సాధించిన విద్యార్థితోపాటు, కళాశాల పీడీ లక్ష్మణరావులను ప్రిన్సిపాల్ మధుసూదనరావు అభినందించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు, పలువురు అధ్యాపకులు, తోటి విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వశాంతి మహాయజ్ఞం

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి పర్కన్‌మాల పంచాయతీ సిరిపేటలోని జగన్నాథ స్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వశాంతి మహాయజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శ్రీక్షేత్ర ప్రధాన అర్చకులు విజయనాంద్ పాండా, ఖోయిర్‌పూట్ ఆలయ అర్చకులు, ట్రస్ట్ సభ్యులు సనాతన్ మడీ సమక్షంలో ఈ నెల 4 నుంచి ఈ యజ్ఞం జరుగుతోంది. గంజాంకు చెందిన మహంత్ బ్రజభందు దాస్ మహరాజ్ హాజరై హోమం విశిష్టతను వివరించారు. లోక కల్యాణం కోసం మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం, గోపూజ నిర్వమించారు.



హోమం జరిపిస్తున్న దంపతులు



హరేరామ హరేకృష్ణ కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు



మండపం వద్దకు వచ్చిన మహిళా భక్తులు



అన్నదానం కోసం వంటలు చేస్తున్న దృశ్యం



ఆలయ ముఖద్వారం

ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా లలాట మహాపాత్రో



లలాట మహాపాత్రోను సన్మానిస్తున్న నిర్వాహకులు

జయపురం: భువనేశ్వర్‌లో ఒడిశా ఫొటోగ్రాఫర్ల మహాసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో నిర్వహించిన ఒడిశా ఫొటో మేళాలో జయపురం ఫొటోగ్రాఫర్ లలాట మహాపాత్రో ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ఎంపికయ్యారు. ఫొటో మేళాలో పాల్గొన్న కొరాపుట్ జిల్లా ఫొటోగ్రాఫర్ల బృందానికి లలాట మహాపాత్రో నేతృత్వం వహించారు. ఫొటోగ్రాఫర్ మహాపాత్రోను రాష్ట్ర ఫొటోగ్రాఫర్ మహాసంఘ అధ్యక్షుడు సంజయ కుమార్ రథ్ మెమెంటో బహూకరించి సన్మానించారు. రాష్ట్ర ఫొటో మేళాను ప్రతిఏటా రాష్ట్ర ఫొటోగ్రాఫర్ మహాసంఘం నిర్వహిస్తుందని మహాపాత్రో వెల్లడించారు. మేళాలో అన్ని జిల్లాల నుంచి 10 వేల మంది ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారని తెలిపారు. మేళాలో మోడలింగ్ ఫొటోలు తీయటంపై ఫొటోగ్రాఫర్లకు నిర్వాహకులు శిక్షణ ఇచ్చారన్నారు. ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లను ప్రోత్సహించటమే రాష్ట్ర స్థాయి ఫొటోగ్రాఫర్ల మేళా లక్ష్యమని నిర్వాహకులు వెల్లడించారు.

కోటి దీపారాధనకు ఏర్పాట్లు



రూపుదిద్దుకుంటున్న ప్రవేశ ద్వారాలు



మైదానంలో ఏర్పాటుకానున్న విగ్రహాలు

రాయగడ: గుణుపూర్‌లోని బగువా మందిరం సమీపంలో గల మైదానంలో ఈ నెల 8వ తేదీ నుంచి కోటి దీపారాధన కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయి. పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సన్నహాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఐదు రోజుల పాటుగా జరిగే ఈ దీపారాధన కార్యక్రమాల్లో వేల సంఖ్యలో భక్తులు పాల్గొనేందుకవీలుగా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే భారీ విశ్వేశ్వర, నంది తదితర విగ్రహాలను మైదానంలో ఏర్పాటు చేసేందుకు సన్నహాలు చేస్తున్నారు. ప్రవేశద్వారాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయాల గోపురాల మాదిరిగా రూపుదిద్దుకుంటున్న ప్రవేశ ద్వారాల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాలు కోటబొమ్మాళికి చెందిన సుసరావు ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ శ్రీరాం డిగ్రీ కళాశాలలో రూ.50 లక్షల ప్రభుత్వ నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను బుధవారం ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ప్రారంభించారు. ఎన్నికల ముందు అప్పటి 5టీ కార్యదర్శి పాండియన్ నిధులు మంజూరు చేశారు. ఎమ్మెల్యేను కళాశాల విద్యా కమిటీ అధ్యక్షుడు ప్రశాంత బోనపాలి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, కాశీనగర్ బ్లాక్ అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, ఎన్‌ఏసీ చైర్‌పర్సన్ మేడిబోయిన సుధారాణి, బీజేడీ బ్లాక్ అధ్యక్షులు కరిమి మధు తదితరులు పాల్గొన్నారు.

ధూమపానానికి దూరంగా ఉండాలి

- గుసాని సమితిలో పొగాకు విముక్తి అభియాన్ 2.0



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిబ్బంది

పర్లాకిమిడి: ధూమపానానికి ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. గజపతి జిల్లా గుసాని సమితిలో గురండి సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అన్ని విద్యాసంస్థలలో పొగాకు విముక్తి అభియాన్ 2.0 ప్రచారాన్ని బుధవారం చేపట్టారు. గురండి మీనాకేతన్ కళాశాల విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని పొగాకు, తమాకు సేవించడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో డాక్టర్ లతికా బెహరా, డెంటల్ సర్జన్, ప్రిన్సిపాల్ డాక్టర్ గోదావరి జెన్నా, అధ్యాపకులు లంబోదర్ రౌతో, సునీతా బెహరా, మీనాక్షి పాణిగ్రాహి, గురండి జనస్వాస్థ్య సంప్రసారణ అధికారి మమాతా పాఢిలు పాల్గొన్నారు. అలాగే గారబందలోని శ్రీవేంకటేశ్వర ఉన్నత విద్యాలయం, లింగిపురం ఒడిశా ఆదర్శ విద్యాలయం (ఓఏవీ) విద్యార్థులు కూడా పొగాకు వ్యతిరేకంగా ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఒడిశా ఆదర్శ విద్యాలయం, లింగిపురంలో విద్యార్థులచే పొగాకు సేవనానికి దూరంగా ఉంటామని డాక్టర్ పూర్ణ చంద్ర పాత్రో, ప్రిన్సిపాల్ దుంగు యాదవరావుతో ప్రతిజ్ఞ చేయించారు.



బ్యానర్‌ను ప్రదర్శిస్తూ..



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులు

దొంగ అరెస్టు

- చోరీ చేసిన సామగ్రి స్వాధీనం



చోరీ సామగ్రితో నిందితుడు శుభం బిశాయి

జయపురం: జయపురం పారాబెడ సంతోషిమా నగర్‌లో మంగళవారం జరిగిన దొంగతనంతో సంబంధం ఉన్న నిందితుడిని అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసు అధికారి రశ్మీ రంజన్ దొలాయి బుధవారం తెలిపారు. తన ఇంట్లో చోరీ జరిగిందని శివరాం త్రిపాఠీ చేసిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామన్నారు. ఇంటి వెనుక తలుపు బద్దలు కొట్టి లోనికి ప్రవేశించి విలువైన సామాన్లు, దుస్తులు చోరీ చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. దర్యాప్తులో భాగంగా తమసిబ్బంది విచారణ చేస్తుండగా పారాబెడ ఎల్‌ఐసీ కాలనీ సూర్య బిశాయి కుమారుడు శుభం బిశాయి (20) చోరీకి పాల్పడినట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి ఇత్తడి బిందె, దీపపు స్టాండ్, రెండు కంచు దీప స్టాండ్‌లు, రెండు ఇత్తడి గరిటెలు, రెండు కంచు గ్లాసులు, ఒక కంచు బిందె, కంచు సిందూర స్టాండ్, కంచు ఫ్లవర్ వాజ్, రెండు కంచు ప్లేట్లు, ఐదు కంచు కుండలు, రెండు చిన్న కంచు ప్లేట్‌లు, గ్యాస్ స్టౌను స్వాధీనం చేసుకున్నామన్నారు. శుభం బిశాయిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.

కార్పొరేట్ సంస్థపై దాడులు చేసే దమ్ముందా?

- రాష్ట్ర వ్యాపార మహాసంఘం కార్యదర్శి సుధాకర్ పండా
- జయపురం బంగారు వ్యాపారి మృతి ఘటనపై ఆగ్రహం
- నిబంధనలకు విరుద్ధంగా దాడులు నిర్వహిస్తే వ్యాపారాలు నిలిపివేస్తామని హెచ్చరిక



మాట్లాడుతున్న సుధాకర్ పండా, సంఘం ప్రతినిధులు

జయపురం: జయపురం బంగారు వ్యాపారి దుకాణం, ఇళ్లపై జీఎస్టీ అధికారుల దాడి, వ్యాపారి మృతి సంఘటనపై ఒడిశా రాష్ట్ర వ్యాపార మహాసంఘం తీవ్రంగా స్పందించింది. బుధవారం స్థానిక వేదికలో పి.హరిప్రసాదరావు సంతాప సభ నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కార్పొరేట్ వ్యాపార సంస్థలపై ప్రభుత్వానికి, అధికారులు దాడులు జరిపే దమ్ముందా అని సుధాకర్ పండా ప్రశ్నించారు. ప్రభుత్వానికి అత్యధిక టాక్స్‌లు సమకూర్చుతున్న సాధారణ వ్యాపార దుకాణాలపైనే ప్రతాపం చూపుతున్నారని ధ్వజమెత్తారు. దుకాణాలపై దాడులు నిర్వహించే ముందు వారికి తెలియజేయాలన్న నియమం ఉందన్నారు. హరిప్రసాద్ చిన్న దుకాణంలో వ్యాపారం చేస్తుంటే 16 మంది సీటీ, జీఎస్టీ అధికారులు వెళ్లి 12 గంటలపాటు శోదాలు నిర్వహించటం ఎంతవరకు భావ్యమన్నారు. సహజంగా బంగారు వ్యాపారులకు 6 నెలల వ్యాపారం ఒక్కరోజులోనే అవుతుందని వెల్లడించారు. సాధారణ వ్యాపారుల ద్వారా గతంలో ఏడాదికి జీఎస్టీలో 19 స్లాబ్‌ల ద్వారా రూ.5 లక్షల కోట్లు ప్రభుత్వం ఆదాయం పొందేదని, ఇప్పుడు రూ.23 లక్షల కోట్లు పొందుతుందని వెల్లడించారు. ఎవరో చెబితే జీఎస్టీ అధికారులు దాడిచేయటాన్ని వ్యాపార మహాసంఘం ఖండిస్తుందన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగితే ప్రభుత్వానికి సంఘం సహకరించేది లేదని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల ముందు ఎఫ్‌డీఐ అమలు చేయమని బీజేపీ పెద్దలు హామీ ఇచ్చి, అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే రిటైల్ వ్యారులపై ఎఫ్‌డీఐ అమలు చేస్తున్నారన్నారు. దేశంలో 9 కోట్ల రిటైల్ వ్యాపారులలో ద్వంద్వ పరిణామాలు నెలకొంటున్నాయన్నారు. రెండు కోట్ల మంది వ్యాపారులు వృత్తిని విడిచిపెట్టారన్నారు. ఈ ప్రభుత్వం.. వ్యాపారుల ఆత్మగౌరవాన్ని కాల రాస్తుందని ఆరోపించారు. ఒడిశాలో 20 లక్షల మంది వ్యాపారులు ఉన్నారని, ఒక్కొక్క షాపులో దాదాపు నలుగురు పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం చిల్లర వ్యారులపై సవతి ప్రేమ చూపితే తాము సహాయ నిరాకరణ చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే తమ జీఎస్టీ లైసెన్సులు రిటన్ చేస్తామన్నారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర మహాసంఘం అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ఇండస్ట్రీస్ అండ్ ట్రేడర్స్ కో ఆర్డినేటర్ బిజేంద్ర అగర్వాల్, రాష్ట్ర కోఆర్డినేటర్ జితేంద్ర గుప్త, జయపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు వి.ప్రభాకర్, కార్యదర్శి డి.మాధవ, ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాస రావు, నౌరి బెహర, జి.బసంతరావు పాల్గొన్నారు.

పోస్టాఫీసులో ఖాతాలు పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం పోస్టాఫీసులో సేవింగ్స్ ఖాతాలను పోస్టల్ అధికారులు బుధవారం పరిశీలించారు. గత నెల 25న పోస్టు మాస్టర్ క్రాంతి కుమారి ఆత్మహత్యకు పాల్పడడంతో సేవింగ్స్ ఖాతాదారులు పక్క గ్రామాలకు వెళ్లి, తమ ఖాతాల్లో ఉన్న డిపాజిట్ డబ్బులు తెలుసుకున్నారు. అయితే ఆమె తమ డబ్బులను ఖాతాల్లో జమ చేయకుండా వ్యక్తిగతంగా వాడుకున్నారని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. ఈ పోస్టాఫీసు పరిధిలో 900 ఖాతాలు ఉన్నాయి. పోస్టల్ అధికారి గౌరీ శంకర్ ఆధ్వర్యంలో ఖాతాలు పరిశీలించారు. ఖాతాల్లో జమ చేసిన డబ్బులకు పూర్తిస్థాయి భద్రత ఉంటుందని, ఎప్పుడైనా తమ డబ్బులు విత్‌డ్రా చేసుకోవచ్చునని అధికారులు తెలిపారు. అనధికారంగా జరిగిన లావాదేవీలు, ఆధారాలు లేని లావాదేవీలపై తాము చేసేదేమీ లేదని స్పష్టం చేశారు. అయితే స్థానికుల నిరక్షరాస్యతను ఉపయోగించుకొని పోస్టుమాస్టర్ మోసం చేశారని వాపోతున్నారు. ఉన్నతాధికారులకు పూర్తిస్థాయి నివేదిక అందజేయనున్నట్లు సిబ్బంది తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: నందిగాం మండలం కొత్త అగ్రహారం గ్రామానికి చెందిన రామారావు అనే రైతు బుధవారం మద్యం మత్తులో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే స్పందించిన స్థానికులు టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. ఈ విషయమై తమకు ఎటువంటి సమాచారం అందలేదని నందిగాం పోలీసులు తెలిపారు.

పుస్తెలతాడు చోరీ

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామంలో రెడ్డికవీధికి చెందిన అమర శ్రీలత ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి శ్రీలత మెడలోని బంగారు పుస్తెల తాడు చోరీ చేశాడు. ఈ మేరకు బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏఎస్‌ఐ బి.సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశా కార్యకర్తల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు



ఆస్పత్రికి తాళం వేసిన దృశ్యం

భువనేశ్వర్: కటక్ నగర పాలక సంస్థ సీఎంసీ 58వ నంబరు వార్డు బంపొకుదొ నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలందిస్తున్న ఆశా కార్యకర్తలు ఆస్పత్రికి తాళం వేసి ఆందోళనకు దిగారు. నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడం, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్నామని ఇన్నేళ్లా జీతాలు ఆలస్యమైనా సహించామని, అయితే స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తమకు నియమించారని తెలిసిందని, తక్షణమే తమను క్రమబద్ధీకరించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసు, ఆరోగ్య కేంద్రం అధికారులు ఈ నెల 14 వరకు గడువు ఇస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన రైతుల జీవనాధారమైన జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు గొరకల బాలకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని మర్రిపాడులో శ్రీకాకుళ అమరుల స్థూపం వద్ద అమరవీరులకు బుధవారం నివాళులర్పించారు. ఈనెల 22న నిర్వహించనున్న శ్రీకాకుళ అమరవీరుల 46వ స్మారక సభను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాన్ని అవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ శ్రీకాకుళ సాయుధం పోరాటంలో అమరులైన తామాడ గణపతి, డాక్టర్ చాగంటి భాస్కరరావు స్ఫూర్తితో ఉద్దాన రైతుల, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా జీడి పంటకు మద్దతు ధర, ఉద్దానంలో పట్టి పీడిస్తున్న కిడ్నీ వ్యాధికి శాశ్వత పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజా వ్యతిరేక చట్టాలను అమలు చేయడానికి పూనుకుందని విమర్శించారు. కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు రాపాక మాధవరావు, పోతనపల్లి కుసుమ, సార జగన్, జె.అప్పయ్య, పోతనపల్లి మల్లేశ్వరరావు, కామేశ్వరరావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

జామి: మండలకేంద్రం జామి మాధవరాయి మెట్టవద్ద కాలనీలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వలున్నాయన్న సమాచారం మేరకు వీఆర్వోలు అరుణ, కృష్ణ తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. కాలనీకి చెందిన కొర్రా లక్ష్మి ఇంటిలో సుమారు 300 కేజీల రేషన్ బియ్య నిల్వలున్నట్లు ఈ సందర్భంగా వీఆర్వోలు గుర్తించారు. పట్టుకున్న బియ్యంపై పౌరసరఫరాల అధికారులకు సమాచారం అందిస్తామని వీఆర్వోలు తెలిపారు.

డిసెంబరు 8న భగవద్గీత పోటీలు

విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి విజయనగరం జిల్లాశాఖ ఆధ్వర్యంలో డిసెంబరు 8న టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో భగవద్గీత పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ప్రోగ్రామింగ్ అధికారి జె.శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈ మేరకు స్థానిక కల్యాణ మంటపం ఆవరణలో బుధవారం ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు ఉంటాయన్నారు. 6వ అధ్యాయం ఆత్మసంయమ యోగం, ధ్యానయోగం నుంచి పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి డిసెంబర్ 7న మధ్యాహ్నం 2 గంటలకు కొమరాడ మండలంలోని కోటిపాం గ్రామంలో నిర్వహిస్తున్నా మని చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు పీవీవీ నరసింహాచార్యులు, జి. తిరుపతి రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి 12 మందికి గాయాలు

జగదాంబ: విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం రంగరాయపురం గ్రామానికి చెందిన 12 మంది ఆటో బోల్తాపడడంతో స్వల్పంగా గాయాల పాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో జీవీఎంసీ 39వ వార్డులోని కన్నె మేరీమ్మ ఆలయానికి వారంతా వచ్చారు. ప్రార్థన అనంతరం 11 గంటల సమయంలో ఘాట్ రోడ్డు దిగుతుండగా బ్రేక్ ఫెయిలై ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న ప్రయాణికులందరూ రోడ్డుపై పడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న హార్బర్ స్టేషన్ ఎస్సై మోహనరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని గాయాలపాలైన వారందరినీ చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం 11 మంది డిశ్చార్జి కాగా పరదేశి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: జిల్లాకేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. దీనిపై వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక శాంతినగర్ రామాలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు గత నెల 28న స్థానికుల నుంచి వచ్చిన ఫోన్‌కాల్‌తో అక్కడికి చేరుకుని 108 సాయంతో కేంద్రాస్పత్రిలో చేర్పామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 5న మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. మృతుడికి సుమారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని, ఆచూకీ గురించి విచారణ చేయగా ఎటువంటి సమాచారం లేనందున మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

లారీ ఢీకొని వ్యక్తి..

భోగాపురం: మండలంలోని సవరవిల్లి జాతీయ రహదారిలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని బుధవారం రాత్రి ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పాండ్రంకి గ్రామానికి చెందిన కర్రి సూరిబాబు(40) ప్రభుత్వం అమలుచేస్తున్న ఉచిత గ్యాస్ పథకం కోసం ఈకేవైసీ చేయించుకునేందుకు తన తల్లి సంతోషిని బైక్‌పై ఎక్కించుకుని బుధవారం భోగాపురం బయల్దేరాడు. పనులు ముగించుకుని సర్వీస్ రోడ్డులో ఇంటికి తిరిగి వెళ్తుండగా సవరవిల్లి చేరుకునేసరికి విశాఖపట్నం నుంచి ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టడంతో సూరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు.తల్లి సంతోషి తీవ్ర గాయాలపాలైంది. స్థానికుల ద్వారా ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. తల్లి సంతోషిని మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై టీఎస్ఎన్ రాజు తెలిపారు.

పుస్తెలతాడు చోరీ

విజయనగరం క్రైమ్: పక్షవాతంతో మంచంపై ఉన్న మహిళ మెడలో పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తి లాక్కుని పరారయ్యాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పౌర సరఫరాల శాఖలో పనిచేసి 2017లో పదవీవిరమణ చేసిన పైల నాగేశ్వరరావు, ఆయన భార్య రామలక్ష్మి విజయనగరంలోని ఉడా కాలనీ ఎంఐజీ 202లో నివాసం ఉంటున్నారు. 2016 నుంచి రామలక్ష్మి పక్షవాతంతో మంచానికే పరిమితమయ్యారు. అయితే వ్యక్తిగత పనిమీద నాగేశ్వరరావు బయటకు వెళ్లారు. సాయంత్రం 4.15 గంటలకు ఇంట్లో ఒంటరిగా ఉన్న నాగేశ్వర రావు భార్య వద్దకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలో ఉన్న నాలుగున్నర తులాల పుస్తెల తాడును లాక్కుని పారిపోయాడని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ధైర్యంగా ఉంటే.. రోగం పరారీ..!

- ఏటా పెరుగుతున్న కేన్సర్ కేసులు
- జీవన శైలిలో మార్పులతో వ్యాపిస్తున్న వ్యాధి
- ఏడాదికి 600నుంచి 800 వరకు కొత్తగా రోగులు
- నేడు జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎఫ్ఎన్ఏసీ పరీక్ష చేస్తున్న టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: పూర్వీకులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల అతి తక్కువ మంది క్యాన్సర్ బారిన పడేవారు. కానీ నేటి మానవులు పాశ్చాత్య పోకడలకు పోయి పిజ్జాలు, బర్గర్లు వంటివి అధికంగా తినడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణంతకవ్యాధుల బారిన పడుతున్నారు. అలాగే ప్రస్తుతం జీవన శైలిలో మార్పు కారణం కూడా క్యాన్సర్ వ్యాప్తి అధికమవుతోంది. గురువారం జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

గతంతో పోల్చితే కేన్సర్ రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గ్రామాల్లో అవగాహన లేక గతంలో కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకునే వారు కాదు. దీంతో సదరు రోగులు ఏవ్యాధితో చనిపోయారో తెలిసేది కాదు. ప్రస్తుతం ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. దీంతో ఏచిన్న ఆరోగ్య సమస్య వచ్చినా చికిత్స చేయించుకోవాలనే అలోచన వస్తోంది. కేన్సర్ స్క్రీనింగ్ పెరగడం వల్ల వ్యాధి ఎంతమందికి ఉందనేది తెలుస్తోంది. చాలా మంది కేన్సర్ అనగానే భయాందోళనకు లోనవుతారు. దీని వల్ల త్వరగా చనిపోతున్నారు. కేన్సర్ వచ్చినా భయపడాల్సిన పని లేదు. అయితే ప్రాణాంతకమైన కేన్సర్‌ను కూడా ఆత్మవిశ్వాసంతో జయించవచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు.

కేన్సర్‌లో రకాలు:

కేన్సర్‌లో పలు రకాలు ఉన్నాయి. వాటిలో కొన్ని ముఖ్యమైన కేన్సర్‌లు, లక్షణాలు ఇలా ఉన్నాయి. మహిళలకు అధికంగా గర్భాశయ కేన్సర్, రొమ్ము కేన్సర్‌లు సోకే అవకాశం ఉంది. పురుషుల్లోను, పొగతాగే వారికి గొంతు, నోటి కేన్సర్ వ్యాప్తి అధికంగా ఉంటుంది. చిన్న పిల్లల్లో బ్లడ్ కేన్సర్ వ్యాప్తి చెందే ఆస్కారం ఉంది. జిల్లాలో ఏడాదికి 600 నుంచి 800 మంది వరకు కేన్సర్ బారిన పడుతున్నారు. వారిలో నోటి కేన్సర్ కేసులే అధికంగా ఉంటున్నాయి.

కేన్సర్ వాధి పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ముప్పు వాటిల్లుతుంది. అవగాహన రాహిత్యం, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వెరసి దేశంలో 40 లక్షల మంది ఏడాదికి కేన్సర్ బారిన పడుతున్నారు. కాలంతో పాటు జీవనశైలిలో మార్పులు, కాలుష్యం, అలవాట్లు, ఆహార పదార్థాలు, ఇలా అనేక కారణాల వల్ల కేన్సర్ వస్తుంది. ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స పొందడం ద్వారా మరణాన్ని జయించవచ్చు. ఇప్పటికే ఎంతో మంది ఈ తరహా చికిత్సలు తీసుకుంటూ బతికి బయటపడ్డారు.

కేన్సర్‌లో నాలుగు దశలు

కేన్సర్‌ను తొలిదశలో గుర్తించినా డబ్బుల ఖర్చు తప్ప బతికి బట్టలేమని చాలా మంది చికిత్సకు దూరంగా ఉండేవారు. దీంతో మరణాల సంఖ్య పెరుగుతూ వచ్చింది. మద్యపానం, ధూమపానం, వంటి దుర్వ్యసనాలు, స్థూలకాయం, కూరగాయలు మితంగా తినడం, శారీరక శ్రమకు ప్రాధాన్యమివ్వకపోవడం, ఇలాంటి వారికి కేన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. నాలుగు దశల్లో కేన్సర్‌ను గుర్తించవచ్చు. మొదటి దశలో కేన్సర్ కణాల్ని స్క్రీనింగ్ ద్వారా గుర్తించి సరైన చికిత్స అందించవచ్చు. ఇలా చెయ్యడం ద్వారా 95 నుంచి 100 శాతం వరకు వ్యాధినయం చెయ్యవచ్చు. రెండో దశలో కేన్సర్ కణాలు ఒక భాగం నుంచి ఇతర భాగాలకు కొంచెంకొంచెంగా విస్తరించడం ప్రారంభమవుతాయి. వీటికి రెడిష్‌థెరపి అందితే 70 నుంచి 80 శాతం వరకు పూర్తి స్థాయిలో నయమవుతుంది. ఇక మూడో దశలో కేన్సర్ ఇతర భాగాలకు పూర్తిగా విస్తరిస్తుంది. రేడియేషన్, కీమోథెరపీ ఇస్తే 50 నుంచి 60 శాతం మందికి తగ్గుముఖం పడుతుంది. ఇక చివరి దశలో కేన్సర్ కీలకమైన అవయవాలకు సోకుతాయి. ఇలాంటి వారికి చికిత్స అందించినా ఆశించిన ఫలితం ఉండదు. కేవలం 5 నుంచి 10 శాతం మంది మాత్రమే బతికే అవకాశాలుంటాయి.


కేన్సర్‌పై అవగాహన కల్పించే వాల్‌పోస్టర్

2023లో నమోదైన కేసుల వివరాలు:	
కేన్సర్ రకం	కేసుల సంఖ్య
ఓరల్ కేన్సర్	274
బ్రెస్ట్ కేన్సర్	153
సర్వైకల్ కేన్సర్	171
2024లో నమోదైన కేసుల వివరాలు:	
ఓరల్ కేన్సర్	321
బ్రెస్ట్ కేన్సర్	233
సర్వైకల్ కేన్సర్	216

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వ్యాధి నిర్ధారణ

గతంలో కేన్సర్ నిర్ధారణ పరీక్షల కోసం విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేది. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కేన్సర్ నిర్ధారణకు ఓ విభాగాన్ని ఏర్పాటు చేసింది. కేన్సర్‌వ్యాధిని నిర్ధారించే ఎఫ్ఎన్ఏసీ, పాప్సిమీర్, బయాప్సీ వంటి పరీక్షలు సర్వజన ఆస్పత్రిలోనే చేస్తున్నారు.

బాధితుల్లో ధైర్యం నింపాలి



కేన్సర్ అనగానే వ్యాధిగ్రస్తులు భయపడతారు. కాబట్టి కేన్సర్ సోకిన వారిలో ధైర్యాన్ని నింపాలి. కేన్సర్ వచ్చినా భయపడాల్సిన అవసరం లేదన్న విషయాన్ని చెప్పాలి. కేన్సర్ ఏస్థితిలో ఉన్నా నియంత్రించవచ్చు. ఎంతోమంది కేన్సర్ వ్యాధిని జయించి సాధారణ జీవితాన్ని గడుపుతున్నారు. గర్భాశయ ముఖద్వార కేన్సర్, రొమ్ముకేన్సర్ బాధితులు అధిక శాతం కోలుకుంటున్నారు. కేన్సర్ వ్యాధిగ్రస్తులకు ఎక్కువుగా నొప్పులు వస్తాయి. అటువంటి వారికి పాలియాటివ్ థెరపీ ద్వారా చికిత్స అందిస్తారు.

డాక్టర్ శంబంగి అప్పలనాయుడు,
సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

అధిక ఆదాయం వచ్చే పంటలను ప్రోత్సహించాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో తక్కువ నీటి సాంద్రతతో అధిక ఆదాయం తెచ్చే పంటలను రైతులు సాగుచేసుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రాథమిక రంగాలకు సంబంధించిన శాఖలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక దిగుబడితోపాటు అధిక ఆదాయం వచ్చే పంటలపై దృష్టి సారించి, రైతులు పండించేలా వారికి అవగాహన కల్పించాలని అధికారులకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా లాభసాటి పంట అయిన నిమ్మగడ్డిని రైతులు పండించేలా ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ పంటలతోపాటు ఉద్యాన వన పంటలను ప్రోత్సహిస్తూ, బీమా కవరేజ్ అయ్యేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాలో గొర్రెల పెంపకం యూనిట్ల సంఖ్య మరింత పెరగాలని, ఇందుకు అవసరమైన యూనిట్ల స్థాపన జరగాలని స్పష్టం చేశారు. జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రైతుల ఆదాయం మరింత పెరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పశు సంవర్ధక, అటవీ, పట్టు, చేనేత తదితర శాఖాధికారులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు జ్యోత్స్న ఎంపిక

సంతకవిటి: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న గుణుపూరు జ్యోత్స్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 7వ తేదీన ఏలూరు జిల్లా ఉంగుటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-14 అథ్లెటిక్స్ పోటీల్లో ఆమె పాల్గొంటుందని హెచ్ఎం వి.వెంకటరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు జ్యోత్స్నను బుధవారం అభినందించారు.

10న ఉచిత డీఎస్సీ శిక్షణకు స్క్రీనింగ్ పరీక్ష

విజయనగరం అర్బన్: షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్ష కోసం భోజన, వసతి సౌకర్యంతో మూడు నెలల పాటు ఉచితంగా ఇస్తున్న శిక్షణకు ఈనెల 10వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రామానందం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ పోర్టల్స్‌లో ఇప్పటికే నమోదు చేసుకున్న అభ్యర్థులు పరీక్ష హాల్ టికెట్‌లను httpr://jnanabhumi.ap.gov.in.website నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. స్క్రీనింగ్ పరీక్ష ఆరోజు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందని, అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు పరీక్ష సమయానికి అరగంట ముందుగా హాజరు కావాలని తెలియజేశారు. పట్టణంలోని గాజులరేగ సమీపంలో సత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-మేనేజ్ మెంట్, డెంకాడ మండలం జొన్నాడలోని లెండి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్-టెక్నాలజీ కళాశాల, తగరపువలస బ్రిడ్జి సమీపంలోని చెరుకుపల్లిలో అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్-టెక్నాలజీని పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఉత్తరాఖండ్ శుభారంభం


ఆంధ్రా- ఉత్తరాఖాండ్ జట్ల మధ్య హోరాహోరీగా జరుగుతున్న క్రికెట్ మ్యాచ్

విజయనగరం: విజయనగరం వేదికగా నిర్వహించ తలపెట్టిన ఆంధ్ర- ఉత్తరాఖండ్ మ్యాచ్ రంజీ మ్యాచ్ బుధవారం ప్రారంభమైంది. డెంకాడ మండలంలోని చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో టెస్ట్ మ్యాచ్ తరహాలో నాలుగు రోజుల పాటు జరిగే మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఉత్తరాఖండ్ జట్టు మొదటి రోజు శుభారంభం చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ప్రారంభించిన జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 87 ఓవర్లలో వికెట్ నష్టపోయి 223 పరుగులు జోడించింది. జట్టు బ్యాటింగ్‌లో ఓపెనర్ అవినీష్ సుధ 86 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔట్ కాగా..మరో ఓపెనర్ పీఎస్.ఖండూరి 107 పరుగులు చేసి నాటౌట్‌గా, సమర్థ్ 35 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. బౌలింగ్‌లో ఆంధ్ర క్రీడాకారుడు లలిత్ మోహన్ 26 ఓవర్లలో ఒక వికెట్ దక్కించుకోగా..మిగిలిన బౌలర్లు రాణించలేకపోయారు. మ్యాచ్‌ను నార్త్ జోన్‌క్రికెట్ అకాడమీ చైర్మన్ ఎం.వాసుదేవరాజు పర్యవేక్షించారు.

ఆశ్రమ పాఠశాలల్లో... మృత్యు ఘంటికలు!

- వివిధ ఆరోగ్య సమస్యలతో తనువుచాలిస్తున్న ఆశ్రమ విద్యాకుసుమాలు
- ఈ ఏడాదిలో ఏడుగురి మృతి
- శిశు, గిరిజన సంక్షేమ శాఖలకు ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి సంధ్యా రాణి ఇలాకాలోనే విద్యార్థి మరణాలు
- ఆవేదనలో విద్యార్థి వర్గాలు

సాక్షి, పార్వతీపురం మన్యం:

ఆశ్రమ పాఠశాలల్లో మృత్యుఘంటికలు మోగుతూనే ఉన్నాయి. సీజనల్ వ్యాధులు, జ్వరాలు, వివిధ ఆరోగ్య సమస్యలతో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నారు. ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెబుతున్నప్పటికీ.. పిల్లల మరణాలు ఆగడం లేదు. ఈ ఏడాది కాలంలోనే ఏడుగురు విద్యార్థులు మృతి చెందారు. ఫలితంగా తమ బిడ్డల్లోనే భవిష్యత్తును చూసుకుంటున్న తల్లిదండ్రులకు కడుపుశోకం మిగులుతోంది.

మంత్రిగారూ.. కాస్త దయ చూపరూ!

జిల్లాలోని సాలూరు నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న గుమ్మిడి సంధ్యారాణి.. రాష్ట్ర మహిళాశిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖల మంత్రిగా వ్యవహరిస్తున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే మొదటి సంతకం ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకంపైనే ఆమె చేశారు. ఇప్పటికీ అది ఆచరణలోకి రాలేదు. ఆశ్రమ పాఠశాలల చిన్నారులు ఒక్కొక్కరుగా ప్రాణాలు వదులుతున్నా.. వాటిపై పర్యవేక్షణ పెంచడం, సమస్యలను పరిష్కరించడం వంటి చర్యలు కానరావడం లేదు. కొద్ది నెలలుగా జిల్లాలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు విజృంభిస్తున్నాయి. నివారణకు పక్కా ప్రణాళిక లోపిస్తోందని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యార్థులు మరణిస్తున్నా మంత్రిలో చలనం కనిపించడంలేదని విమర్శిస్తున్నాయి.

పాపం.. చిన్నారులు

ఈ ఏడాది జులై 6న జియ్యమ్మవలస మండలానికి చెందిన రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బి.ఈశ్వరరావు మృతి చెందాడు. అదే నెల 22న పార్వతీపురం మండలంలోని రావికోన ఆశ్రమ పాఠశాలకు చెందిన పి.రాఘవ అనే ఆరో తరగతి విద్యార్థి సెరిబ్రల్ మలేరియాతో కన్నుమూశాడు. గుమ్మలక్ష్మీపురం మండలం వంగరకు చెందిన నాలుగో తరగతి విద్యార్థి ఎం.గౌతమ్ మలేరియాతో ప్రాణాలు వదిలాడు. కొమరాడ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కద్రక శారద, గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న నిమ్మల అవంతి డెంగీతో ప్రాణాలు వదిలారు. తాజాగా మంగళవారం కురుపాంలో ఓ విద్యార్థి మరణించగా.. బుధవారం జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన ఆశ్రమ పాఠశాలకు ఏడో తరగతి విద్యార్థి నిమ్మక జీవన్ కన్నుమూశాడు. ఇవి కేవలం ఆశ్రమ పాఠశాలల్లో వెలుగు చూసిన ఘటనలే. వీటి సంఖ్య మరింత ఎక్కువే ఉంటుందని గిరిజన సంఘాలు చెబుతున్నాయి. నిత్యం జిల్లాలో గిరిజన విద్యార్థులు మరణిస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ఆ తల్లిదండ్రులకు కడుపుకోత తప్పడం లేదు. కేవలం విద్యార్థులే కాదు.. జ్వరాలు, సీజనల్ వ్యాధులు పెద్దవారినీ కబళించేసిన ఉదంతాలు ఈ ఏడాది అనేకం.


మృతి చెందిన విద్యార్థి జీవన్‌కుమార్

గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న నిమ్మక జీవన్ కుమార్ (12) బుధవారం ఉదయం మృతిచెందాడు. మంగళవారం రాత్రి భోజనం చేసి నిద్రపోయాడని, బుధవారం ఉదయం తెల్లవారు జామున కళ్లు తిరుగుతున్నట్టు తెలిపాడని, దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లేసరికి మృతిచెందినట్టు పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. మృతునిది గుమ్మలక్ష్మీపురం మండలం ఒండిడి గ్రామం. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చదువుకునేందుకు వెళ్లిన జీవన్ శవమై రావడంతో గ్రామంలో విషాదం అలముకుంది.

పర్యవేక్షణ కరవు

జిల్లాలో 55 వరకు ఆశ్రమ పాఠశాలలున్నాయి. రెండు ఐటీడీఏలకు పూర్తిస్థాయిలో సిబ్బంది ఉండకపోవడం వల్ల పర్యవేక్షణ కొరవడుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ఐటీడీఏలకు రెగ్యులర్ పీవోలు ఉండడం లేదు. అధికారుల కొరత.. సరిపడా నిధులు మంజూరు కాకపోవడం.. వెరసి పాఠశాలలపై పర్యవేక్షణను గాలికి వదిలేశారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా ఉంటున్నాయి. చిన్నపాటి జ్వరం వచ్చినా మందులు అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

జ్వరంతో విద్యార్థి మృతి


మృతి చెందిన ఆశ్రమ పాఠశాల విద్యార్థి నిమ్మక నితిన్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (బాలురు)లో నాలుగవ తరగతి చదువుతున్న నిమ్మక నితిన్(9) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన నితిన్ పాఠశాలకు రాకపోవడంతో రెండురోజుల క్రితం ఆశ్రమ పాఠశాల సిబ్బంది నితిన్ స్వగ్రామం గుమ్మలక్ష్మీపురం మండలంలోని గుజ్జలగండ వెళ్లగా అప్పటికే నితిన్ తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యుల సాయంతో చిన్నారిని సమీపంలోని దుడ్డుఖల్లు పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం అందించారు. అప్పటికీ నయం కాకపోవడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు, ఆశ్రమ పాఠశాల సిబ్బంది తెలిపారు.

గిరిజన విద్యార్థుల మరణాలపై సమగ్ర దర్యాప్తుకు డిమాండ్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజన విద్యార్థుల మరణాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కొల్లి గంగునాయుడు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు ఏడుగురు గిరిజన విద్యార్థులు మృతిచెందారని, ఈ మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో తెలియజేయాలన్నారు. విద్యార్థుల అస్వస్థత, వ్యాధుల వ్యాప్తికి కలుషిత తాగునీరే కారణమని వైద్యులు చెబుతున్నా స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మరమ్మతులకు గురైన వాటర్‌ప్లాంట్లు వినియోగంలోకి తేవాలన్నారు. ఇప్పటివరకు చనిపోయిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, వారి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఇకమీదట విద్యార్థుల మరణాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

మన్యంలో జరుగుతున్న గిరిజన విద్యార్థుల మరణాలకు రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన శాఖ మంత్రి బాధ్యత వహించాలి. ఈ విద్యాసంవత్సరంలోనే ఇప్పటి వరకు ఏడుగురు విద్యార్థులు మృతి చెందడం బాధాకరం. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఎటువంటి నివారణ చర్యలూ చేపట్టలేదు. మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి.

– పాలక రంజిత్‌కుమార్, ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి, గిరిజన సంక్షేమ సంఘం

మలేరియా, డెంగీ నియంత్రణకు కృషి


కుంతేసులో మలేరియా బాధితుల వివరాలను ఆరాతీస్తున్న జిల్లా మలేరియా అధికారిణి మణి

గుమ్మలక్ష్మీపురం: మలేరియా, డెంగీ వ్యాధుల నియంత్రణకు కృషి చేస్తున్నట్లు జిల్లా మలేరియా అధికారి మణి తెలిపారు. ఈమేరకు మలేరియా కేసులు ఎక్కువగా నమోదైన గుమ్మలక్ష్మీపురం మండలంలోని కుంతేసు గ్రామాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల మలేరియా వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన వారి ఆరోగ్య పరిస్థితుల గురించి ఆరాతీశారు. మలేరియాతో బాధపడుతున్న వారి ఇంటి సభ్యులందరికీ రక్తపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను అందజేశారు. నిరంతరం పర్యవేక్షణ చేపట్టి గ్రామంలో మలేరియా కేసులు పెరగకుండా వైద్యసిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆమె దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడి ల్యాబ్‌లో నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, వాటి ఫలితాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియా పాజిటివ్ వచ్చిన ప్రతి గ్రామంలో ఏఎల్వో పిచికారీతో పాటు నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆమె వెంట సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ, విస్తరణ అధికారి సత్యారావు, సబ్ యూనిట్ అధికారి రాధాకృష్ణ ఉన్నారు.

వెంకంపేట సమీపంలో ఏనుగుల గుంపు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని వెంకంపేట గ్రామంలో ఏనుగుల గుంపు సంచరిస్తోందని రూరల్ ఎస్సై సంతోషి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వెంకంపేట గ్రామ సమీపంలో ఏడు ఏనుగుల గుంపు సంచరిస్తోందన్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ప్రజలు పనుల నిమిత్తం బయటకు రావాలని సూచించారు. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో వెంకంపేట గ్రామంలో ఏనుగులు సంచరించడంతో పట్టణంలోకి ప్రవేశించే అవకాశాలున్నాయని పట్టణ వాసులు భయప్రాంతులకు గురవుతున్నారు. ఏనుగులను తరలించేందుకు అటవీ శాఖాధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, పట్టణ వాసులు కోరుతున్నారు.